# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 205 శనివారం 04 - 04 - 2026 పేజీలు : 8 వెల. 2/-

Printed by Guntur, Prakasam, Krishna , Circulated From Guntur, Prakasam, Krishna , Kakinada, Anantapur, NTR, Ongole, Visakapatnam, Eluru, Telangana









## ముఖ్య ప్రకటనలు

మీ ఇంట వివాహాది శుభకార్యములు
మీ పెళ్లిరోజు, పుట్టినరోజు మరియు
మీ వ్యాపార ఇతర కార్యముల కొరకు మా పత్రికలో
అతి తక్కువ ధరలకు ప్రకటనలు వేయబడును.
ఇతర వివరముల కొరకు
క్రైం కౌంటర్ దినపత్రిక ఉమ్మడి రాష్ట్రం కార్యాలయం
సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్
Ph.No: 98497 07349


# దేశం మొత్తానిది ఒక దారి వారిది మరో దారి...



**అమరావతి, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** అమరా వతికి చట్టబద్ధత కల్పించడం ప్రజల విజయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం సీఎం మీడియాతో మాట్లాడు తూ... వైసీపీ అమరావతిని నాశనం చేయాలని చూస్తే తాము శాసనం చేశామని చెప్పుకొచ్చా రు. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ అమరావతికి చట్టబద్ధత లభించడం ప్రజా విజయమన్నారు. రెండు సభల్లోనూ 35 మంది వరకు ఎంపీలు అమరావతికి మద్దతుగా మాట్లాడారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు 5 కోట్ల మంది ప్రజల తరఫున సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. దేశం మొత్తానిది ఒక దారైతే... తమదో దారి అన్నట్లు వైసీపీ వ్యవహరించిందని సీఎం విమర్శించారు. రాష్ట్రం, దేశం నాశనమైనా పర్వాలేదు.. తమకు స్వార్థ రాజకీయమే ముఖ్యమన్నట్లుగా వైసీపీ వ్యవహ రించిందని ఆరోపించారు.

**తెలంగాణకు వ్యతిరేకం కాదు...**

తెలంగాణ తన బ్రెయిన్ చైల్డ్ అని.. తెలుగుదేశం పార్టీని అక్కడే స్థాపించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణకు తాను వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో ఏడు మండలాలను ఏపీలో కలిపితేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. తనకున్న అనుభవం, కేంద్ర సహకారంతో ఆ ఏడు మండలాలు ఏపీలో కలిశాయని తెలిపారు. ఆ ఏడు మండలాలు కలిపితేనే పోలవరం సాకారమవుతుందని కేంద్రం గుర్తించిందన్నారు.

**ఆనాడు వైసీపీ సమర్థించింది...**

శివరామకృష్ణన్ కమిటీ నివేదిక ఆధారంగా గుంటూరు - విజయవాడ మధ్య రాజధాని ఉంటే బాగుంటుందని అందరూ అన్నారని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రం మధ్యలో ఉన్న ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యం ఉందన్నారు. సమృద్ధిగా నీరు, సారవంతమైన భూములు ఉన్నాయని చంద్రబాబు వివరించారు. ఆనాడు అసెంబ్లీలో వైసీపీ కూడా రాజధానిని సమర్థించిందని... కనీసం 30 వేల ఎకరాలు ఉండాలని జగన్ చెప్పారని తెలిపారు. గుంటూరు - విజయవాడ మధ్యలోనే రాజధానిని ఏర్పాటు చేయాలని ఆనాడు జగన్ అన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు.

**పైసా తీసుకుకోకుండా**

'నా చేతిలో డబ్బులు లేవు.. కానీ నూతన రాజధాని నిర్మించాలనే సంకల్పం ఉంది' అని సీఎం చెప్పారు. భూ సమీకరణ విధానం ప్రకటించిన వెంటనే రైతులు ముందుకు వచ్చి కేవలం నమ్మకం మీదనే నయా పైసా తీసుకోకుండా 34 వేల ఎకరాలు త్యాగం చేశారని సీఎం గుర్తు చేశారు. 11 నెలల్లో సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నిర్మించామని తెలిపారు. తాను ట్రాన్సిట్ సచివాలయం అన్నా వైసీపీ దాన్ని కూడా రాద్ధాంతం చేసిందని.. అంటే వాళ్ల నైజం ఏమిటో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతికి పవిత్రత ఉందని, అన్ని పవిత్ర దేవాలయాల నుంచి మట్టి, నీరు తీసుకొచ్చి అమరావతిని పునీతం చేశామని చంద్రబాబు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా పార్లమెంట్‌లో మట్టి, యమునా నది నుంచి నీరు తీసుకొచ్చారని గుర్తు చేశారు.

**భగవంతుడు రెండు అవకాశాలిచ్చారు...**


'నేను ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాను... వైసీపీ మాత్రం కుట్రలు చేస్తూ ముందుకు వెళ్లింది. స్మశానం, ఎడారి అని, నిర్మాణాలకు పనికిరాదని ప్రచారం చేసింది. ప్రపంచ

2 లో



## సామరస్యం, కరుణ, క్షమాగుణాలను మరింత పెంపొందించాలి: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ సోదరులు ఇవాళ ఏసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ 'గుడ్ ఫ్రైడే' పాటిస్తున్నారు. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు తన సందేశాన్ని అందించారు. ఈ పవిత్ర దినం సమాజంలో సామరస్యం, కరుణ, క్షమాగుణాలను మరింత పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. గుడ్ ఫ్రైడే మనకు ఏసుక్రీస్తు చేసిన త్యాగాన్ని గుర్తు చేస్తున్న ఆయన, సమాజంలో సోదరభావం, ఆశ మనందరికీ మార్గదర్శకం అవ్వాలని ప్రధాని ఆకాంక్షించారు.



## భారీ వడగాల్పులు..

### విపత్తు నిర్వహణ సంస్థ కీలక సూచనలు

**అమరావతి, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాష్ట్రంలోని పలు మండలాల్లో శనివారం భారీ వడగాల్పులు, వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. రాష్ట్రంలోని 73 మండలాల్లో భారీ వడగాల్పులు, 17 మండలాల్లో వడగాల్పులు.. ఆదివారం 32 మండలాల్లో భారీ వడ గాల్పులు, 21 మండలా ల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో

2 లో

## ఎమ్మెల్యే అరవింద బాబుపై సీఎం చంద్రబాబు సీరియస్



**అమరావతి, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. పార్టీ పరువుకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల తాను చెప్పిన వ్యక్తికి లీగల్ అడ్వైజర్ పోస్ట్ ఇవ్వలేదని అరవింద బాబు హల్ చల్ చేశారు. ఏకంగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయం కాస్తా పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఎమ్మెల్యేతో మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఇవాళ (శుక్రవారం) మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి అరవింద బాబును పల్లా శ్రీనివాసరావు పిలిపించారు. ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడంపై వివరణ కోరారు. ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని.. ఇది ఎంతమాత్రం సహించరాని విషయమని అరవింద బాబుకు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. లీగల్ అడ్వైజర్ నియామకం జరగకపోతే పార్టీ జిల్లా అధ్యక్షుడు, రీజనల్ కోఆర్డినేటర్ లేదా తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అంతేకాని ఇలా పార్టీ పరువుపోయేలా ప్రవర్తించడం ఏంటని నిలదీశారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడం, పార్టీ పరువుకు భంగం కలిగించే ప్రయత్నాలను ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పార్టీ తరఫున తీవ్ర చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు. అయితే, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని ఎమ్మెల్యే అరవింద బాబు హామీ ఇచ్చారు.



## చైనాకు చుక్కెదురు..

### భారీ రాకెట్ ప్రయోగం విఫలం

**ఇంటర్నెట్ డెస్క్:** ఎలాన్ మస్క్ సారథ్యంలోని స్పేస్ ఎక్స్ సంస్థతో పోటీ పడేందుకు ప్రయత్నిస్తున్న చైనాకు తాజాగా ఎదురుదెబ్బ తగిలింది. చైనా స్టార్టప్ సంస్థ స్పేస్ పయనీర్‌కు చెందిన టియాన్‌లాంగ్-3 రాకెట్ గాల్లోకి లేచిన కొన్ని సెకన్లకే పేలిపోయింది. గోబీ ఎడారిలో స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 12.17 సమయంలో ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘటనపై స్పేస్ పయనీర్ సంస్థ తమ పెట్టుబడిదారులకు క్షమాపణలు తెలిపింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొంది. ఘటనకు గల కారణాలను విశ్లేషిస్తున్నట్లు వెల్లడించింది. స్పేస్ ఎక్స్‌కు చెందిన పునర్ వినియోగ రాకెట్ ఫాల్కన్-9తో పోటీ పడేలా టియాన్‌లాంగ్-3ను స్పేస్ పయనీర్ రూపొందించింది. ఒక రాకెట్‌ను కనీసం పది ప్రయోగాలకు వినియోగించుకునేలా రూపొందించారు. ఈ రాకెట్ ఒకేసారి 36 శాటిలైట్స్‌ను కక్ష్యలోకి మోసుకుపోగలదు. శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం భారీ సంఖ్యలో కియాన్‌ఫాన్ ఉపగ్రహాలను ప్రయోగించేందుకు చైనా లక్ష్యాన్ని నిర్దేశించుకుందని అక్కడి మీడియా చెబుతోంది. ఇప్పటివరకూ చైనా 108 కియాన్‌ఫాన్ శాటిలైట్‌లను కక్ష్యలోకి పంపింది. వచ్చే ఏడాది చివరి నాటికి 1300 శాటిలైట్‌లను, 2030 నాటికల్లా 15 వేల శాటిలైట్‌లను ప్రయోగించాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా టియాన్‌లాంగ్-3 అభివృద్ధిపై స్పేస్ పయనీర్ దృష్టిపెట్టింది. ఇక ఫాల్కన్-9 రాకెట్ సాయంతో స్టార్‌లింక్ ఇప్పటికే వేల సంఖ్యలో బ్రాడ్‌బాండ్ శాటిలైట్‌లను విజయవంతంగా ప్రయోగించింది.

## రాజధాని అమరావతికి.. త్వరలో పిన్‌కోడ్




2 లో




## నీటిపారుదల శాఖ అధికారులపై మంత్రి నిమ్మల సీరియస్..

**విజయవాడ: ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్

2 లో

## దేశం మొత్తానిది ఒక దారి.. వైసీపీది మరో దారి: సీఎం చంద్రబాబు

బ్యాంకుకు ఉత్తరాలు రాశారు. వరద వస్తే మునిగిపోతుందని భయపెట్టారు. మూడు రాజధానులు అని మూడు ముక్కలాట ఆడారు' అని విమర్శించారు. తన రాజకీయ జీవితంలో ఇటువంటి వారిని ఎప్పుడూ చూడలేదన్నారు. అయినా 2024 ఎన్నికల్లో ప్రజలు తిరుగులేని తీర్పు ఇచ్చి అమరావతే రాజధాని అని స్పష్టం చేశారని తెలిపారు. భగవంతుడు తనకు రెండు అవకాశాలు ఇచ్చారని... హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు సైబరాబాద్‌ను యాడ్ చేశానని.. ఇప్పుడు అమరావతిని తీర్చిదిద్దే బాధ్యత వచ్చిందని అన్నారు. వైసీపీ అమరావతి బ్రాండ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. అమరావతి బాండ్లు రెండు గంటల్లో అమ్ముడుపోయాయని.. అంటే అమరావతి బ్రాండ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంత ఆదరణ ఉందో అర్థమవుతోందని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

స్వీట్స్ తినిపించిన సీఎం..

అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై సీఎం చంద్రబాబును మీడియా ప్రతినిధులు అభినందించారు. ఇది చాలా గర్వించదగిన క్షణాలని, అమరావతి అంటే ఎమోషన్ అని సీఎం అన్నారు. ఆనందంలో తాను కూడా స్వీట్ తింటానని చెప్పి స్వీట్ తిన్నారు సీఎం. అందరికీ స్వయంగా సీఎం చంద్రబాబు స్వీట్స్ ఇచ్చారు.

## భారీ వడగాల్పులు.. విపత్తు నిర్వహణ సంస్థ కీలక సూచనలు

ఎండ తీవ్రత సైతం పెరుగుతుందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

శనివారం (04-04-26) శ్రీకాకుళం జిల్లాలో16, విజయనగరం 24, పార్వతీపురం మన్యం 15, అల్లూరి 3, పోలవరం 9, అనకాపల్లి 2, కాకినాడ 3, తూర్పుగోదావరిలో 1 మండలాల్లో భారీ వడగాల్పులు వీచే అవకాశం ఉందని వివరించారు. శ్రీకాకుళం 2, పోలవరం 2, అనకాపల్లి 1, కాకినాడ 2, తూర్పుగోదావరి 3, ఏలూరు 4, ఎన్టీఆర్ 1, పల్నాడు 2 మండలాలలో వడగాల్పులు ప్రభావం చూపుతాయన్నారు.

శుక్రవారం మన్యం (జి) భామినిలో 41.8డిగ్రీసి, చిత్తూరు(జి) రాయలపేటలో 41.4డిగ్రీసి, అనకాపల్లి(జి) నాతవరంలో 40.9డిగ్రీసి, శ్రీకాకుళం(జి) జి.సిగడాంలో 40.5డిగ్రీసి, నంద్యాల (జి) ఆలమూరు, కడప(జి) బద్వేల్‌లో 40.4డిగ్రీసి, ఏలూరు(జి) ధర్మాజీ గూడెం, తిరుపతి(జి) రేణిగుంట, విజయనగరం(జి) రాజాంలో 40.3డిగ్రీసి, కృష్ణా(జి) కంకిపాడులో 40.1డిగ్రీసి, కర్నూలు(జి) తోవి 40డిగ్రీసి చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించారు.

వడగాల్పులు వీచనున్న నేపథ్యంలో మహిళలు, పిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల సంస్థ ఎండీ విజ్ఞప్తి చేశారు. డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.

## రాజధాని అమరావతికి.. త్వరలో పిన్‌కోడ్

అమరావతి, ఏప్రిల్ 03: రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బిల్లు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకంతో ఈ బిల్లు.. ఒకటి రెండు రోజుల్లో గెజిట్‌గా మారనుంది. ఈ క్రమంలో అమరావతి నూతన రాజధానికి త్వరలోనే సరికొత్త పిన్ కోడ్ ను తపాలా శాఖ విడుదల చేయనుంది. దీంతో ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతిగా భారత తపాలా శాఖ ద్వారా అధికారికంగా గుర్తింపు లభించనుంది. అడ్వకేట్, సామాజిక కార్యకర్త వి. రమేశ్ చంద్ర వర్మ దాఖలు చేసిన ఫిర్యాదుపై తపాలా శాఖ శుక్రవారం స్పందించింది. అలాగే రాజధాని ప్రాంతంలో జనరల్ పోస్ట్ ఆఫీస్ (జీపీఓ) నిర్మాణానికి ఇప్పటికే భూమిని సేకరించినట్లు వెల్లడించింది. ఈ జీపీఓ నిర్మాణం పూర్తయిన వెంటనే సర్కిల్ కార్యాలయ అనుమతితో కొత్త పిన్ కోడ్‌ను కేటాయించనున్నట్లు తెలిపింది. ఆధార్, పాస్‌పోర్ట్ సేవలతో పాటు ప్రత్యేక పిన్ కోడ్ కోసం అడ్వకేట్ రమేష్ చంద్ర వర్మ ఇచ్చిన సూచనలను తాము పరిగణనలోకి తీసుకుంటామని పోస్టల్ శాఖ స్పష్టం చేసింది. అంతవరకు ప్రస్తుతం ఉన్న సబ్-ఆఫీసుల ద్వారా ఈ సేవలు కొనసాగుతాయని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు - 2026 నేపథ్యంలో రైతుల సంక్షేమం, పాలనా సౌలభ్యం కోసం సాగించిన ఈ పోరాటంలో ఇది కీలక అడుగు అని అడ్వకేట్ రమేశ్ చంద్ర వర్మ వెల్లడించారు.

## నీటిపారుదల శాఖ అధికారులపై మంత్రి నిమ్మల సీరియస్..

నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై మంత్రి నిమ్మల రామానాయుడు సీరియస్ అయ్యారు. విధి నిర్వహణలో అలసత్వంపై మంత్రి ఆగ్రహించారు. నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత పనుల అంచనాల తయారీపై అధికారులతో మంత్రి నిమ్మల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంచనాల తయారీపై ఇరిగేషన్ అధికారులు అలసత్వం ప్రదర్శించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్, మే నెలల్లో చేయాల్సిన పనులకు సంబంధించి ఇంకెప్పుడు అంచనాలు రూపొందిస్తారని సీఈలను మంత్రి ప్రశ్నించారు. గతంలో ఏప్రిల్, మేలో చేసే పనులకు జూన్‌లో అనుమతులు ఇచ్చేవారని.. గత ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా ఇప్పుడూ ప్రవర్తిస్తామంటే ఊరుకునేది లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు ఇకనైనా తీరు మార్చుకోవాలని మంత్రి నిమ్మల హితవు పలికారు. ఆదివారం సాయంత్రంలోగా అంచనాలు సమర్పించాలని సీఈలకు ఆదేశాలు జారీ చేశారు. గడువులోగా అంచనాలు సమర్పించని సీఈలు సోమవారం నాడు అమరావతి సచివాలయానికి వచ్చి సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికలు తీయకపోవడంతో సాగునీరందక గత ఐదేళ్ల పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు కేటాయించి, చివరి ఎకరం వరకూ సాగు నీరందించేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో కాలువల మరమ్మత్తు పనులు చేపట్టామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశానికి ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీఈలు, ఆ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రాష్ట్రంలో మహిళలపై ఆగని అత్యాచారాలు హత్యలు అదుపు చేయలేని హోం మంత్రి అనిత... గార్లపాటి దాసు.

**క్రోసూరు క్రైమ్ కౌంటర్ పోతుగంటి నాగేశ్వరరావు** క్రోసూరు.. రాష్ట్రంలో మహిళలపై ఆగని అత్యాచారాలు హత్యలు అదుపు చేయలేని హోం మంత్రి అనిత రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానర్బుల్ చైర్మన్ గార్లపాటి దాసు డిమాండ్ చేసినారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పల్నాడు జిల్లా మాచర్లలో ఒంటరిగా ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగిని కాళ్లు. చేతులు. కట్టేసి. నోట్లో గుడ్డల కుక్కి అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గుడు ఆమెపై అత్యంత పాశవికముగా ప్రవర్తించిన నిందితుడను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఆడబిడ్డల జోలికి వస్తే అదే ఆఖరి రోజు అవుతుందని అన్నారు. అందుకేనేమో షెడ్యూల్డ్ కులమునకు చెందిన వంగలపూడి అనితను రాష్ట్ర హోం శాఖ మంత్రిగా నియమించినారు. కానీ ఈమె పదవి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలను మహిళలను మరియు చిన్నపిల్లలను అత్యాచారం చేసి హత్యలు చేసిన నిందితులను శిక్షించడంలో చొరవ చూపలేదు ఒక్క నిందితుడైన కఠినంగా శిక్షించలేదు. రాష్ట్రంలో వైన్ షాపులు బెల్ట్ షాపులు తో గంజాయి పీల్చేవారు ఎక్కువయ్యి మహిళలపై అత్యాచారాలు చేసేవాళ్లు ఎక్కువైపోతున్నారు ఇకనైనా రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ కల్పించి నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని హోం మంత్రి అనితను ఆమె పదవి నుండి తొలగించాలని గార్లపాటి దాసు డిమాండ్ చేసినారు





**సత్తెనపల్లి నియోజకవర్గం** సత్తెనపల్లి రూరల్ మండలం పాకాలపాడు గ్రామం నందు కాల్వపల్లి సైదారెడ్డి గారు మరణించిన వార్త తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సత్తెనపల్లి నియోజకవర్గ



శాసనసభ్యులు.శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారు

ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మిరప రైతులను వెంటాడుతున్న కష్టాలు

### దిగుబడిపై తెగుళ్లు, మొంథా తుఫాను ప్రభావం
### మూడు నెలల్లోనే రూ.30 వేలు తగ్గిన ధర

**ఏప్రిల్ 03 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఉరవకొండ(అనంతపురం): మిరప రైతుల కష్టాలు తీరడం లేదు. దిగుబడి ఉంటే ధర ఉండదు. ధర ఉన్నప్పుడు దిగుబడి ఉండదు. దీంతో సాగు చేసిన రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. ఉరవకొండ నియోజకవర్గంలో పుష్కర కాలం నుంచి మిరప సాగు గణనీయంగా పెరిగింది. హెచ్చెల్సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువలతో పాటు బోరుబావుల కింద సుమారుగా 30వేల ఎకరాల్లో మిరపసాగు అయ్యింది. ఈ ఏడాది ఇప్పటికే 80శాతం పైగా పంట రైతుల చేతికి వచ్చింది. నల్లతామర, తెగుళ్లతో పాటు, మొంథా తుఫాన్ కూడా దిగుబడిపై ప్రభావం చూపించింది.నవంబరు, డిసెంబరు నెలలో అననుకూల వాతావరణ పరిస్థితుల వల్ల పంటను కాపాడుకునేందుకు రైతులు రోజు మార్చి రోజు మందులను పిచికారీ చేశారు. దీంతో ఖర్చు తడిసి మోపెడయ్యింది. మూడు నెలల కిందట డబ్బీ రకం క్వింటా రూ.85వేలు పలకగా ప్రస్తుతం రూ.55వేల నుంచి, రూ.65వేల మధ్య నడుస్తోంది. దిగుబడిని విక్రయించేందుకు రైతులు పొలాల్లోనూ, మార్కెట్ యార్డుల్లో నిల్వ చేసుకుని వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు.

రూ.లక్షల్లో పెట్టుబడి

దుక్కిదున్నడం, విత్తనాలు, మొక్కలు నాటిన కూలితో పాటు, ఎరువులు, పురుగుమందులు, పంటకోత కూలీలకు ఇలా ఎకరా విస్తీర్ణంలో మిరప సాగుకు మొత్తం పెట్టుబడి రూ.1.5లక్షలు పెట్టారు. కౌలు రైతులు అయితే మరో రూ.50వేలు అదనంగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఎకరాకు సాధారణంగా 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావాలి. ఈసారి 8 నుంచి 10 క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. దీంతో ధర ఓ మోస్తరుగా ఉన్నా దిగుబడి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మంచి ధర వచ్చే వరకు పంట దిగుబడులను నిల్వ చేసుకోవడానికి అవకాశాలు లేక రైతులు పొలాల్లో చెట్ల కిందే రాశులుగా పోశారు. సాధారణంగా మిరప దిగుబడులను శీతల గిడ్డంగులలో నిల్వ చేయాలి. అలాంటి సదుపాయం



జిల్లాలో ఎక్కడా లేదు. ఒక వేళ నిల్వ చేయాలంటే బ్యాడిగి, బళ్లారి, గుంటూరు ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. అదంతా మరింత వ్యయప్రయాసలతో కూడిన పని. జిల్లాలోనే ఏదో ఒక మార్కెట్‌లో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అమ్మాలంటే కర్ణాటకకు వెళ్లాలి


నాలుగున్నర ఎకరాల్లో పంట సాగుచేశా. ఎకరాకు రూ.2లక్షల దాకా పెట్టుబడి పెట్టాం. గత ఏడాదితో పోలిస్తే దిగుబడి కొంత పెరిగింది. క్వింటా ధర రూ.55వేలకు మించి అడగడం లేదు. తుఫాను, తెగుళ్ల దిగుబడిపై ప్రభావం చూపాయి. పండిన పంటను అమ్ముకోవాలంటే కర్ణాటకకు వెళ్లాల్సి వస్తోంది.

– కిష్టప్ప, రైతు, ఉరవకొండ

జనవరిలో మంచి ధర

జనవరిలో డబ్బీ ధర రూ.80 వేల నుంచి రూ.90వేల దాకా పలికింది. 20 రోజుల్లోనే ధర భారీగా పడిపోయింది. ఇప్పుడు రూ.50వేలు పలుకుతోంది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. చేసిన కష్టమంతా పెట్టుబడికే సరిపోతుంది. ఈ ఏడాది నల్లితెగులుతో పెట్టుబడి మరింత పెరిగింది

## చిత్తూరులో దారుణం.. యువకుడిని హత్య చేసి చెరువులో పడేసిన దుండగులు



**క్రైం కౌంటర్ ప్రతినిధి,** చిత్తూరు, ఏప్రిల్ 3: చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి మండలంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మొదలపల్లి గ్రామానికి చెందిన లవ కుమార్ (28) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని సమీప చెరువులో పడేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.స్థానికుల సమాచారం ప్రకారం.. లవకుమార్ గత కొంత కాలంగా అమర్ రాజా అనే కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హతమార్చి, మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేశారు. చెరువులో మృతదేహం తేలడాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పాత కక్షల వల్ల ఈ హత్య జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

క్రైమ్ కౌంటర్ గుంటూరు




## జగన్.. అమరావతిని ఇంచు కూడా కదపలేరు: గంటా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** పార్లమెంట్‌లో అమరావతి రాజధాని బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డివివిధ సందర్భాల్లో రాజధాని గురించి మాట్లాడిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే విడుదల చేశారు. అమరావతిపై జగన్ మాట్లాడిన మాటలు చూస్తే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్ధమవుతోందన్నారు. అమరావతిపై జగన్‌లా ఇన్ని ప్రకటనలు చేసిన వ్యక్తి ప్రపంచంలో మరెవరూ ఉండరంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అమరావతిని అంగీకరించారని.. గెలిచిన తర్వాత మూడు రాజధానులు అన్నారని గంటా శ్రీనివాస్ తెలిపారు. అమరావతి తీర్మానంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి కూడా హాజరుకాలేదన్నారు. పార్లమెంట్‌లో అమరావతికి వ్యతిరేకంగా ఉన్న ఏకైక పార్టీ వైసీపీ అని తెలిపారు. మొన్నటి వరకు ఉత్తరాంధ్ర అన్న జగన్.. ఇప్పుడు మావిగన్ అని అంటున్నారని అన్నారు. మాజీ సీఎంకు ఏ అంశంపైనా ఒక స్థిరమైన అభిప్రాయం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. వైసీపీకి 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ మారడం లేదన్నారు ఎమ్మెల్యే. ఏప్రిల్ 15వ తేదీ లోపు గూగుల్ శంకుస్థాపన చేయొచ్చని వెల్లడించారు. అమరావతి కలల రాజధానిని సాధించుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమరావతి ప్రజలను ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అంతా చూశారన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో జగన్ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదపలేరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## అరిదమన్ అనేది ఒక శక్తి: కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్




**విశాఖపట్నం, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. శుక్రవారం విశాఖపట్నంలో భారత్ తన మూడో స్వదేశీ అణు బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమన్‌ను ఆయన నౌకాదళంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు.దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.



సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం పార్టీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వర రావు గారి కుమారుడు వివాహానికి హాజరై వరుడు వధువును ఆశీర్వదించిన గుంటూరు నగర మాజీ మేయర్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు శ్రీ కన్నా నాగరాజు గారు ,రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ చైర్మెన్ సరికొండ వెంకటేశ్వర రాజు (మార్కెట్ రాజు )మహిళా యువత అధ్యక్షులు తోట అంబికా రవి చంద్ర ముప్పాళ్ల క్లస్టర్ ఇంచార్జ్ అతోట వెంకట కృష్ణ మరియు నియోజకవర్గా వివిధ హోదాలో వున్న నాయకులు పాల్గొన్నారు...

## క్రీస్తు బోధనలే మనకు మార్గదర్శకం.

### శిరస్సు మీద ముళ్ళ కిరీటం - భుజం పై సిలువ. క్రీస్తు ప్రేమను మరోసారి చూపిన ఎమ్మెల్యే. డాక్టర్ చదలవాడ అరవింద బాబు.



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట ప్రతినిధి (జి.యం.కె.)**–లోక రక్షకుడు యేసుక్రీస్తు సమస్త మానవాళి కొరకు చేసిన త్యాగానికి గుర్తుగా జరుపుకునే గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని నరసరావుపేట పట్టణంలో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని 5వ వార్డు క్రిస్టియన్ పాలెం నందు క్రైస్తవ సోదరులు చేపట్టిన సిలువ యాత్రలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని తలపై ముళ్ళ కిరీటాన్ని ధరించి,భుజంపై సిలువను మోసి తన భక్తి శ్రద్ధలను మరోసారి చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుడ్ ఫ్రైడే దినం మానవాళి కోసం యేసుక్రీస్తు సిలువ మరణంలో చూపిన ప్రేమ ఆయన త్యాగాలను మనకు గుర్తుచేస్తుందని లోక పాపాలను కడిగివేసేందుకు ఆయన మరణాన్ని సైతం చిరునవ్వుతో ఆహ్వానించారని కొనియాడారు.మన ప్రవర్తన ద్వారా క్రీస్తు మార్గన్ని చూపుతూ సమాజంలో ప్రేమ,శాంతి,దయను వ్యాప్తి చేయాలని ఈ పవిత్రమైన రోజున క్రీస్తు బోధనలను స్మరిస్తూ ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు.క్రీస్తు చూపిన ప్రేమ మార్గం అందరికీ ఆదర్శనీయమని తోటివారి పట్ల దయతో మెలగడమే దేవునికి క్రైస్తవులు ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరీ సోదరులకు చిన్నా,పెద్దలందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,పెద్ద సంఖ్యలో క్రైస్తవ మత పెద్దలు,విశ్వాసులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఒకే మాట.. 'రాజధాని అమరావతి'



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** 'ఐదు కోట్ల మంది ఆంధ్రులు అందరిదీ ఒకే మాట.. అదే రాజధాని అమరావతి' అని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందుతున్నందున ఇది ఏపీ చరిత్రను పునర్నిర్వచించే చారిత్రాత్మకమైన రోజని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఇది ఎంతో భావోద్వేగంతో కూడిన క్షణమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు, 2026పై గురువారం రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. విభజన సమయంలో ఏపీకి రూ.16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉందని, భవిష్యత్తుపై అస్పష్టత నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి క్లిష్ట సమయంలో ప్రజలకు చంద్రబాబు ఒక ఆశాకిరణంలా నిలిచారని కొనియాడారు. ఒక కొత్త విమానాశ్రయ నిర్మాణానికి వెయ్యి ఎకరాలు సేకరించడమే కష్టమైన తరుణంలో, అమరావతి రైతులు కేవలం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రాజధాని కోసం ఇచ్చారని ప్రశంసించారు. 'గత వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం అమరావతిని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించింది. మూడు రాజధానుల ప్రతిపాదనతో రాష్ట్రంలో గందరగోళం, అనిశ్చితిని సృష్టించింది. ఎవరెన్ని కుట్రలు పన్నినా అమరావతిలో ఒక్క ఇటుక కూడా కదల్చలేకపోయారు. రాజధాని కోసం పోరాడిన మహిళలను, గర్భిణులను సైతం నాటి వైసీపీ ప్రభుత్వం హింసించింది.' అని రామ్మోహన్ ఆరోపించారు. అమరావతిని పునర్నిర్మాణం చేస్తామని 2024 ఎన్నికల్లో శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు ప్రజలకు కూటమి హామీ ఇచ్చిందని, వారు 175కి 164 సీట్లు ఇచ్చి చారిత్రాత్మక విజయాన్ని అందించారని చెప్పారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, అనంతపురం, రాయలసీమ ఇలా అన్ని ప్రాంతాల ప్రజలు ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు తెలిపారని, ఇది ఈ అంశంపై రాష్ట్రవ్యాప్త ఐక్యతను చాటిచెబుతోందని పేర్కొన్నారు.

## బాబోయ్ ఎండలు.. వర్షాలు..! ఈ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వానలు.. ఇదిగో 3రోజుల వెదర్ రిపోర్ట్

**ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి.. ఓ వైపు ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి.. మరోవైపు అక్కడక్కడ వర్షాలు సైతం కురుస్తున్నాయి.. ఈ క్రమంలో వాతావరణ శాఖ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వాతావరణ పరిస్థితులపై కీలక అప్డేట్ ఇచ్చింది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, దాని పరిసర ప్రాంతాలపై ఒక ఉపరితల ఆవర్తనము సగటు సముద్ర మట్టానికి 1.5 నుండి 3.1 కిలోమీటర్ల మధ్య ఎత్తులో విస్తరించి ఉన్నది.

వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి..

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ ఢ యానాం :-

శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశముంది.

శనివారం, ఆదివారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. ఈదురు గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీస్తాయి.

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ :-

శుక్రవారం, శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశముంది.

ఆదివారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. ఈదురు గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీస్తాయి.




రాయలసీమ :-

శుక్రవారం, శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశముంది.

ఆదివారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. ఈదురు గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీస్తాయి.

గమనిక :- కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమలో రాగల 5 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదులో గణనీయమైన మార్పు లేదు.

తెలంగాణ వెదర్ రిపోర్ట్.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. రాగల మూడు రోజులు తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. చాలా జిల్లాల్లో శుక్రవారం.. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయి.

## నరసరావుపేట రూరల్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి-ఎనిమిది మంది అరెస్ట్.



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట ప్రతినిధి (జి.యం.కె.)**–పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు.ఈ క్రమంలో పట్టణ రూరల్ పరిధిలోని రావిపాడు వద్ద గల గ్రీన్ ఫీల్డ్ లేఅవుట్‌లోని ఒక గృహంలో కొంతమంది వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందింది.దీనిపై తక్షణమే స్పందించిన రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, తన సిబ్బందితో కలిసి సదరు ప్రాంతంపై ఆకస్మిక దాడి నిర్వహించారు.పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుండి రూ.15,000/- నగదును స్వాధీనం చేసుకున్నారు.నిబంధనలకు విరుద్ధంగా జూదం,పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు.ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారు ప్రజలను కోరారు.

# అప్రమత్తమైన పోలీసుల చర్య

ఒక కుటుంబాన్ని రక్షించిన నరసరావుపేట రూరల్ పోలీసులు.



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట ప్రతినిధి (జి.యం.కె.)-** నరసరావుపేట పట్టణంలోని గుంటూరు రోడ్డులోని డంపింగ్ యార్డ్ సమీప ఫ్లైఓవర్‌పై ఇద్దరు చిన్నారులతో కలిసి ఆత్మహత్యకు యత్నిస్తున్నామని బంధువులకు సమాచారం ఇచ్చిన ఒక మహిళ ఘటన కలకలం రేపింది. ఈ సమాచారం అందుకున్న మహిళ బంధువులు వెంటనే నరసరావుపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే స్పందించి అందిన సమాచారంతో లోకేషన్‌ను గుర్తించి ట్రేస్ చేశారు. అనంతరం అక్కడికి చేరుకుని కుటుంబాన్ని సురక్షితంగా కాపాడారు. ఈ సందర్భంగా నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ మరియు పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం కాదని అవగాహన కల్పించారు. సమయస్ఫూర్తితో స్పందించిన పోలీసులను మహిళ కుటుంబ సభ్యులు, పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

# రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన ప్రభుత్వం



**క్రైం కౌంటర్ ప్రతినిధి,** నిడదవోలు, ఏప్రిల్ 03: రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శుక్రవారం నిడదవోలులో మంత్రి మనోహర్ విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం1,917 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తామని స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేశామన్నారు. గోతాల సమస్య రాకుండా ఇప్పటికే మిల్లర్లతో చర్చలు జరిపామని వివరించారు. ధాన్యం రవాణా కోసం 17,200 లారీలకు జీపీఎస్ సదుపాయం కల్పించామని చెప్పారు. ఈ ఏడాది రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ధాన్యం నిల్వ, రవాణా విషయంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటామన్నారు. రాజధాని లేకుండా రాష్ట్రంలో అలజడుల సృష్టించాలన్నదే వైసీపీ కుట్ర అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది పాఠశాల మధ్యాహ్న భోజనంలో స్టీమ్ రైస్ ఉండేలా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు.

# పేర్ని నానిపై పోలీసుల కేసు నమోదు!

**ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మచిలీపట్నంలోని కొబ్బరితోట ప్రాంతంలో శ్రీపతి వెంకటాచలం అనే వ్యక్తి అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు ఆ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ ఘటన తర్వాత తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్న పేర్ని నాని, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడున్న అధికారులను, పోలీసులను ఆయన బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసు అధికారుల సంఘం చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు ప్రారంభించారు




# విషాదం.. రీల్స్ చేయడానికి వెళ్లి.. నదిలో మునిగి..

**క్రైం కౌంటర్ ప్రతినిధి,** గోరఖ్‌పూర్, ఏప్రిల్3: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా రాణిదిహా గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. సరదాగా రీల్స్ చేసేందుకు రాప్తి నదికి వెళ్లిన ఐదుగురు విద్యార్థులు నదిలో మునిగిపోయారు. వారిలో ఒక విద్యార్థి ఒడ్డుకు చేరుకోగా.. మిగిలిన నలుగురు నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు బాలురు ఇలా అకస్మాత్తుగా మరణించడంతో రాణిదిహా గ్రామం మొత్తం శోకసముద్రంలో మునిగిపోయింది. రాణిదిహా గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులు బుధవారం మధ్యాహ్నం రాప్తి నది సమీపంలో రీల్స్ చేసుకోవడానికి వెళ్లారు. అమన్ (15), వివేక్ నిషాద్(15) గగన్ పాశ్వాన్(15), అనికేత్ యాదవ్(13)లతో పాటు వారి స్నేహితుడు రాజకరణ్ తమ సైకిళ్ళపై విన్యాసాలు చేస్తూ, వీడియోలు తీస్తూ మీర్జాపూర్ పిపా వంతెన సమీపానికి చేరుకున్నారు. నదిలో స్నానం చేస్తూ రీల్స్ చేద్దామనుకున్నారు. ఆ ఉత్సాహంతో.. ఐదుగురు స్నేహితులు లోతైన నీటిలోకి దిగారు. అంతలోనే నీటి ఉధృతి పెరిగింది. రాజ్‌కరణ్ ధైర్యంగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. మిగిలిన నలుగురు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గజ ఈతగాళ్ల సహాయంతో




భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం నలుగురు మృతదేహాలు రాప్తి నదిలో తేలుతూ కనిపించాయి. పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ పిల్లల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. వారి ఆవేదన చూసి గ్రామస్థులు సైతం కంటనీరు పెట్టుకున్నారు.

# అప్పుడు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు.. అస్సాం ప్రచారంలో అమిత్‌షా



**ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** గువాహటి: చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్థవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు.

పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# టీవీకే చీఫ్ విజయ్ ఎన్నికల అఫిడవిట్లలో వ్యత్యాసాలు..

**క్రైం కౌంటర్ ప్రతినిధి,** చెన్నై, ఏప్రిల్ 03: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో.. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ పార్టీల నుంచి అభ్యర్థులు బరిలోకి దిగి.. తమ నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. టీవీకే పార్టీ చీఫ్ విజయ్ సైతం తన నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో ఆయన.. పెరంబూర్, తిరుచురాపల్లి ఈస్ట్ స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగారు. ఈ రెండు స్థానాల్లో దాఖలు చేసిన అఫిడవిట్‌లో వివరాలు వేర్వేరుగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. పెరంబూర్ స్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనపై ఎలాంటి కేసులు లేవని విజయ్ స్పష్టం చేశారు. తిరుచురాపల్లి ఈస్ట్ స్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు విజయ్ వివరించారని తెలిపారు. 2025లో పెరవల్లూరు పోలీస్ స్టేషన్‌లో విజయ్‌పై నమోదైన కేసును పెరంబూర్ ఫైలింగ్‌లో ఆయన వెల్లడించలేదు. అలాంటి వేళ.. ఈ వ్యత్యాసాలను స్పష్టం చేస్తూ సవరించిన అఫిడవిట్‌ను సమర్పించడం ద్వారా దిద్దుబాటు చర్యలకు ఒక్కటే మార్గమని ఈ సందర్భంగా విజయ్‌కు న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. విజయ్ తన అఫిడవిట్‌లో.. తన మొత్తం ఆస్తుల విలువ రూ.603.20 కోట్లు అని స్పష్టం చేశారు. వాటిలో రూ.213 కోట్లకుపైగా బ్యాంక్ డిపాజిట్లు ఉన్నాయని వివరించారు. వాటితో పాటూ అత్యంత ఖరీదైన కార్లు సైతం తనకు ఉ



న్నాయని.. వాటి వివరాలను తన ఎన్నికల అఫిడవిట్‌లో టీవీకే చీఫ్ విజయ్ ప్రకటించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23వ తేదీన ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు మే 4వ తేదీన వెలువడనున్నాయి.

# రాత్రి మీటింగ్ తర్వాత పబ్లిక్ షాక్: భారత్ రష్యాతో కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది



**ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రపంచ రాజకీయాల్లో ఎన్ని మార్పులు వచ్చినా, భారత్-రష్యా సంబంధాలు స్థిరంగా కొనసాగుతున్నట్లు మరోసారి స్పష్టమైంది. రష్యా ఉప ప్రధానమంత్రి డెనిస్ మాంతురోవ్ గురువారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆర్థిక సహకారం, కనెక్టివిటీ మార్గాలు, ఇంధన భద్రత వంటి కీలక అంశాలపై లోతైన చర్చ జరిగింది. 2025 డిసెంబర్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనలో కుదిరిన "ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యం" రోడ్‌మ్యాప్ అమలుపై మాంతురోవ్ ప్రధానికి వివరాలు అందించారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశానికి అవసరమైన ఎరువులు, ముడి చమురు, ఎల్‌పీజీ సరఫరాలో రష్యా కీలక భాగస్వామిగా నిలుస్తోంది. వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచే ఎరువుల సరఫరాలో సహకారాన్ని మాంతురోవ్ ముఖ్యంగా ప్రధానికి వివరించారు. ఈ చర్చల ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార లోటును తగ్గిస్తూ, ద్వైపాక్షిక వ్యాపారాన్ని సమతుల్యం చేయడానికి కొత్త ప్రణాళికలు రూపొందుతున్నాయి.

లికనెక్టివిటీ ఒ వాణిజ్య మార్గాలు: ఈ సమావేశంలో ప్రధానంగా కనెక్టివిటీ అంశం చర్చకు వచ్చింది. సాంప్రదాయ రవాణా మార్గాలపై ఆధారపడకుండా, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కారిడార్ల నిర్మాణంపై ఇరు పక్షాలు సానుకూలత చూపాయి. అంతర్గతంగా, ఇంటర్నేషనల్ నార్త్-సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ మరియు చెన్నై-వ్లాదివోస్టోక్ ఈస్టర్న్ మారిటైమ్ కారిడార్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ మార్గాల ఏర్పాటుతో భారత్-రష్యా రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది.

లిఅమెరికాకు షాక్, రష్యా నుంచి 60 మిలియన్ బ్యారెళ్ల చమురు: 2026లో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు అవకాశాలు ఉన్నట్లు దౌత్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ ఇంధన, పారిశ్రామిక సహకారం, ప్రజల మధ్య సంబంధాల అభివృద్ధికి దోహదపడుతుంది. సరిహద్దుల్లేని వ్యాపారానికి భారత వ్యూహం: మారుతున్న అంతర్జాతీయ సమీకరణాల్లో, రష్యా వంటి దీర్ఘకాలిక భాగస్వామితో సంబంధాలను బలోపేతం చేయడం ద్వారా భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని స్థిరం చేస్తోంది. ఈ చర్చలు ఇరు దేశాల మధ్య పరస్పర విశ్వాసానికి సుస్థిర నిదర్శనంగా నిలుస్తున్నాయి.

క్రైం కౌంటర్ ప్రకాశం

శనివారం 04 ఏప్రిల్ 2026

# అలరించిన శ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యం చిన్నారులు





**ఒంగోలు క్రైశీకౌంటర్ ప్రతినిధి,** నగరంలోజరుగుతున్న శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయం నకు చెందిన చిన్నారులు శుక్రవారం అత్యద్భుతమైన కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు..నాట్య గురువు కే .లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందర్నీ అల రించింది. కూచిపూడి నాట్యం నేర్చుకోవాలనుకునే చిన్నారులు 7780698718.. నెంబర్ ను సంప్రదించాలని నాట్య గురువు కే లక్ష్మి.అన్నారు.అంతేకాకుండా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి జతులు , సంయుక్త హస్తాలు, అసంయుక్త హస్తాలు కూచిపూడి శ్లోకాలను వేదికపై పఠించారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యం పలువురిని ఆకట్టుకున్నది. దేవాలయ కార్య నిర్వహణ అధికారి రావెళ్ల శివశంకర్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ ప్రసన్నకుమార్ దేవాలయ సిబ్బంది . ఎలక్ట్రీషన్ సురేష్.. తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగాశ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయం చిన్నారులకు అవకాశం కల్పించిన దేవాదాయ అధికారులకు నాట్య గురువు కే లక్ష్మి కృతజ్ఞతలను తెలిపారు.

## విద్యుత్ షాక్ తో పెయింటర్ మృతి...



**క్రైమ్ కౌంటర్ న్యూస్ ....మార్కాపురం జిల్లా....** పొదిలి పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వీదిలో ఒక నూతన ఇంటికి పెయింట్ వేస్తు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో పెయింట్ ర్ అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడు బుచిరాజు నాగరాజు స్థానిక తాలుకాఫీసు వీది వాసి. విద్యుత్ షాక్ గురైన వెంటనే 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.....

## శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా కుటుంబం






**క్రైమ్ కౌంటర్ న్యూస్.....మార్కాపురం జిల్లా....** ప్రజల ఇలావేల్పు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోస్తవల సందర్భంగా నేడు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు ధర్మపత్నీ దుర్గాకుమారి , మరియు వారి తనయుడు అన్నా కృష్ణచైతన్య , మరియు తదితరులు పాల్గొన్నారు...

## ప్రపంచమునకు శాంతి సందేశం



**క్రైమ్ కౌంటర్ న్యూస్ ..... మార్కాపురం జిల్లా....** ప్రపంచమునకు శాంతి సందేశం శుభశుక్రవారం సందర్బంగా మార్కాపురం పట్టణంలోని స్థానిక సెంటినరి బాప్టిస్ట్ చర్చ్ మార్కాపురం నందు ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. యేసుక్రీస్తు సిలువలో చేసిన ప్రాణ త్యాగం సర్వ మానవాలికి అందించిన ప్రేమ సందేశమని, కరుణ, దయ, క్షమా గుణములకు ప్రతీకలని, యేసుక్రీస్తు చూపిన ప్రేమ ప్రపంచ శాంతికి సూత్రమని క్షమ, కరుణ వంటి గుణాలను అందరూ అలవరచుకొని ప్రపంచం శాంతికి కృషి చేయాలని పాస్టర్ విజయభాస్కర్ రావు గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు.....

## గరుడ వాహనంపై కోదండ రామస్వామి



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి.నాగ బ్రహ్మం కందుకూరు రూరల్** ,పట్టణంలోని పెద్ద బజారులో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి గ గరుడ వాహనంపై ఊరేగి భక్తులను తన్మయత్వానికి గురి చేశారు. ఈ బృహత్ కార్యక్రమాన్ని తిలకించడానికి వేలాది మంది భక్తులు బారులు తీరారు స్వామి వారి దివ్య మంగళ రూపాన్ని తిలకించి తరించారు. అనంతరం భక్తాదులకు స్వామివారి మహా ప్రసాద వితరణ జరిగింది.

## రోడ్డు విస్తరణ పనుల సరే!

### ప్రమాద సూచికబోర్డులు మరిచారు!



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** ఓ వీ రోడ్ లో కోటారెడ్డి నగర్ నుంచి సి టి ఆర్ ఐ వరకు రోడ్డు విస్తరణ పనులను చేస్తున్నారు. దీంతో వాహనాలను రాక, పోకలును చేయాలంటే చోదుకులు నానా ఆగచాట్లు పడుతున్నారు.వాహనాలు వేగంగా వెళ్తూ ఒకసారిగా అదుపు చేయాలంటే వారి బాధలు అన్నీ , ఇన్ని కావు. ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయ నందున్న ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రమాదేవి సూచిక బోర్డులనుఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## ఏపీ ఆత్మగౌరవ గర్జన: బీద మస్తాన్‌రావు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, రైతుల త్యాగాలను ఎన్నటికీ మరువబోమని వారికిచ్చే నైతిక వాగ్దానమని టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు అభివర్ణించారు. ఈ బిల్లు ఆంధ్రుల ఆత్మ, అస్తిత్వానికి ప్రతీకగా పేర్కొన్నారు. 'అమరావతి ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవ గర్జనకు ప్రతిరూపం. 5కోట్ల మంది ప్రజల గుండెల్లో తలెత్తిన నినాదం. అమరావతి రాజధాని త్యాగాల పునాదులపైనిర్మితమవుతోంది. ఇది మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. 2019–24 వరకు ఏపీ ఒక చీకటి కాలాన్ని అనుభవించింది. రాజధాని కోసం శాంతియుతంగా పోరాడిన రైతులపై 3,000కు పైగా కేసులు పెట్టారు. రైతులు తమ గ్రామాల్లో తిరగడానికి కూడా ఐడీ కార్డులు చూపించాల్సిన దుస్థితిని కల్పించారు. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలో, ప్రధాని మోదీ మార్గనిర్దేశంలో ఏపీ మళ్లీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది' అని బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు.

## మంత్రి డివిబి స్వామి విన్నపాలను విన్న వలె!



**సింగరాయకొండ క్రైం కౌంటర్ ప్రతినిధి** **సింగరాయకొండ గుజ్జుల యల్లమందారెడ్డి** నగర్, బండపాలెం లలో మౌలిక వసతులను కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లు, మంచినీరు సౌకర్యాలు లేవు. గృహ అవసరాలకు ట్యాంకర్ నీరును రూ 700 కు కొనుగోలు చేస్తున్నామని మహిళలు వాపోతున్నారు. క్యాన్ నీటిని రూ. 15లకు ఆటోల దగ్గర కొనుగోలు చేస్తున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు రాకపోక లను చేయాలంటే అడుగడుగునా గుంటల పడి దర్శనమిస్తున్నాయి. అంగనవాడి స్కూలుకు వెళ్లాలంటే గొల్లపాలెశీ వెళ్లాల్సిందే. గర్భవంతులు, బాలింతలు,చిన్నారులకు టీకాలను చేయడానికి ఆరోగ్య సిబ్బంది రావటం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తాగునీరు, రోడ్లు, అంగన్ వాడి స్కూలు, వైద్య సిబ్బంది , తదితర సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలను తీసుకోవాలని పలువురుకు కోరుతున్నారు.

## అమరావతిలో అంబరాన్నంటిన సంబరం

### శంకుస్థాపన ప్రాంతంలో సీఎం ప్రత్యేక పూజలు

### సతీమణి భువనేశ్వరితో కలిసి జ్యోతి ప్రజ్వలన



**ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తుళ్లూరు/గుంటూరు, అమరావతికి చట్టబద్ధతతో సంబరాలు మిన్నంటాయి. జై అమరావతి.. జయహో ఆంధ్రప్రదేశ్ అంటూ, పచ్చ కండువాలు గాల్లో తిప్పుతూ రాజధానికి భూములిచ్చిన అన్నదాతలు, ఆడపడుచులు వేడుకలు చేసుకున్నారు. ఇందుకు అమరావతి నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేసిన ఉద్దండరాయునిపాలెంలోని పవిత్ర భూమి వేదికైంది. గురువారం రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే రాజధాని గ్రామాల నుంచి వేలాది మంది రైతులు, మహిళలు, రాజధాని పరిరక్షణ ఉద్యమ నేతలు ఉద్దండరాయునిపాలెం చేరుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అక్కడున్న పవిత్రమైన నీరు–మట్టికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సీఎం చంద్రబాబు సతీసమేతంగా పాల్గొన్నారు. పవిత్ర మట్టి, జలాలు ఉంచిన వేదికకు చంద్రబాబు సాష్టాంగ ప్రమాణం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన జ్యోతిని తన సతీమణి భువవనేశ్వరితో కలసి వెలిగించారు. అమరావతి ఉద్యమానికి మద్దతుగా తన చేతి గాజులు తీసిచ్చిన సీఎం సతీమణి నారా భువనేశ్వరిని రైతులు, మహిళలు ఆప్యాయంగా పలకరించి, కృతజ్ఞతలు తెలిపారు. నాటి ఘటనలను ఆమెతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు శ్రావణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, సీఆర్‌డీఏ కమిషనర్ విజయరామరాజు, జేఏసీ నేతలు తదితరులు పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని సీఎం స్వయంగా పంచిపెట్టారు

# ఈ విజయం అమరావతి రైతులకు అంకితం



**అమరావతి, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** చట్టబద్ధతతో రాష్ట్ర రాజధానిగా అమరావతి హోదా ఇక సుస్థిరమని, దీనిపై ఇకపై ఎలాంటి అనుమానాలు, చర్చలకు తావు లేదని సీఎం చంద్రబాబు గురువారం 'ఎక్స్' పోస్టులో స్పష్టం చేశారు. ఏపీకి గుండె, ఆత్మ అయిన అమరావతి ఇక అన్‌స్టాపబుల్ అని పేర్కొన్నారు. పార్లమెంట్ ఉభయసభల్లో 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026' ఏకగ్రీవంగా ఆమోదం పొందటంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు, వారి సంకల్పానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలు నేడు దేశ రాజధానిలో ప్రతిధ్వనించాయని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. అమరావతి ప్రస్థానంలో ప్రధాని మోదీ ప్రతి కీలక సందర్భంలోనూ అండగా నిలిచారని గుర్తుచేశారు. 2015 అక్టోబరు 22న అమరావతికి శంకుస్థాపన చేయడంతో పాటు 2025 మే2న పునర్నిర్మాణ పనులను కూడా ఆయన చేతుల మీదుగానే ప్రారంభించుకోవడం గర్వకారణమన్నారు. అమరావతికి వెన్నుదన్నుగా నిలిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర ప్రభుత్వానికి, బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేక అనేక సవాళ్లు, అనిశ్చితిని ఎదుర్కొందని, అలాంటి క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అమూల్యమైన త్యాగం, వారి పట్టుదల, నమ్మకం రాజధాని కలను సజీవంగా ఉంచాయని కొనియాడారు. ఈ చారిత్రక విజయాన్ని అమరావతి రైతులకు అంకితం చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అమరావతిని ఏకైక ప్రజా రాజధానిగా పేర్కొంటూ పార్లమెంట్ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలో ఒక కొత్త శకానికి నాంది పలికిందన్నారు. దేశానికి అమరావతి ఒక అద్వితీయమైన భవిష్యత్ నగరంగా నిలుస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. అమరావతి ద్వారా లభించే ఈ స్థిరత్వం ప్రతి ఆంధ్రుడిలో కొత్త విశ్వాసాన్ని నింపాలని ఆకాంక్షించారు.

# వ్యక్తులు శాశ్వతం కాదు.. వ్యవస్థలు ముఖ్యం



**అమరావతి, ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఈరోజు అమరావతి రైతులు హాయిగా నిద్రపోగలుగుతున్నారని ప్రధానితో భేటీ సందర్భంగా ఆయనకు తాను చెప్పానని లోకేశ్ వెల్లడించారు. మీ కృషి, ప్రోత్సాహం వల్లే బిల్లు ఆమోదం పొందిందంటూ 5 కోట్ల మంది ఆంధ్రుల తరఫున ధన్యవాదాలు తెలిపానన్నారు. మీ సహకారం వల్లే అమరావతి, పోలవరం, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి అనేక ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని చెప్పినట్లు తెలిపారు. ఇందుకు ప్రధాని స్పందిస్తూ.. 'వ్యక్తులు, అధికారం శాశ్వతం కాదు, వ్యవస్థలు శాశ్వతం. ఆ వ్యవస్థలను మనం పటిష్ఠంగా ముందుకు తీసుకెళ్లాలి. వ్యవస్థలు దెబ్బతింటే దేశం నష్టపోతుంది. ఇది కరెక్టు కాదు' అని లోకేశ్‌కు చెప్పారు. 'భోగాపురం విమానాశ్రయ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి.. మీరు రావాలని నేను కోరగా.. తప్పనిసరిగా వస్తానని ఆయన హామీ ఇచ్చారు. మీరంతా హ్యాపీగా ఉన్నారా అని అడిగారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు, అమరావతి రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పాను. 2014లో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండి ఏపీకి ప్రచారానికి వచ్చినపుడు.. రాష్ట్ర విభజనపై మాట్లాడుతూ.. బిడ్డను బతికించి తల్లిని చంపేశారని ఆయన అన్నారు. ఇప్పటికీ ఆయన ఆ మాటలను గుర్తుపెట్టుకున్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని సొంతకాళ్లపై నిలబడేవరకు ఆదుకోవాలని ఆయన భావిస్తున్నారు. చంద్రబాబు టెక్నాలజీలో వెరీ గుడ్, ఆయన అనుకుంటే ఏదైనా సాధిస్తారు, ప్రాజెక్టులన్నీ గ్రౌండ్ చేస్తే.. దేశానికి తిరిగి మీరు కంట్రిబ్యూట్ చేయగలుగుతారని మోదీ చెప్పారు, ఆర్థిక కార్యకలాపాలను వేగవంతంచేసి ముందుకెళ్లాలని సూచించారు' అని లోకేశ్ వివరించారు.

# పుదుచ్చేరిలో మోదీ భారీ రోడ్‌షో.. రెండోసారి కోటలో పాగాకు ప్రచారం



**ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** పుదుచ్చేరి: జాతీయ ప్రజాస్వామ్య కూటమికి మద్దతు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుదుచ్చేరి లో శుక్రవారంనాడు భారీ రోడ్‌షో నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, పాండిచ్చేరి హోం మంత్రి ఎ.నమశ్శివాయం సైతం ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. అజంతా సిగ్నల్ పాయింట్, కామరాజ్ విగ్రహం–రాజా థియేటర్ సిగ్నల్ మధ్య సుమారు రెండు కిలోమీటర్ల మేర గంటసేపు రోడ్‌షో జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు ముందుకు సాగగా, బీజేపీ కార్యకర్తలు, అల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌సీ) కార్యకర్తలు పార్టీ జెండాలతో పెద్దఎత్తున పాల్గొన్నారు. దీనికి ముందు, పుదుచ్చేరి చేరుకున్న ప్రధానమంత్రికి బీజేపీ మద్దతుదారులు ఘనస్వాగతం పలికారు. 'జైశ్రీరామ్' 'భారత్ మాతా కీ జై' నినాదులు హోరెత్తించారు. ప్రధాన కాన్వాయ్‌పై పూలజల్లులు కురిపించారు. పుదుచ్చేరిలో ఏఐఎన్ఆర్‌సీ–బీజేపీ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు విస్తృత ప్రచారం సాగిస్తున్న తరుణంలో మోదీ రోడ్‌షోతో ప్రచారం మరింత ఊపందుకుంది. ఇటీవల పుదుచ్చేరి బీజేపీ కార్యకర్తలతో వర్చువల్ షోలోనూ మోదీ పాల్గొని వారిని మరింత ఉత్సాహపరిచారు. ఈ ఎన్నికల్లో సీట్ల పంపకాల్లో భాగంగా ఏఐఎన్ఆర్‌సీ 16 స్థానాల్లోనూ, బీజేపీ 10 స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి. కూటమిలో ఇతర భాగస్వాములుగా ఉన్న అన్నాడీఎంకే, లాట్చియ జననాయగ కట్చి (ఎల్‌జేకే) చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# వీసా, పాస్‌పోర్ట్? ఇక అవసరం లేదు - తెలుసుకోండి ఎలా!

**ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఇక పాస్‌పోర్ట్ లేదా వీసా వంటి కష్టసాధ్యమైన డాక్యుమెంట్ల కోసం బారపడాల్సిన అవసరం లేదు! భారతదేశంలోనే ఒక ప్రత్యేక ఊరు ఉంది, అక్కడ కాలి అడుగు పెట్టడం ద్వారా మీరు నేరుగా మరో దేశంలోకి ప్రవేశించి అద్వితీయమైన అనుభూతిని పొందవచ్చు. ఆ ఊరు భూటాన్‌లోని జైగావ్. సాధారణంగా ఊహించని విధంగా, భూటాన్‌లో ప్రవేశించడానికి ప్రత్యేక అనుమతులు అవసరం లేకుండా, కేవలం ఓటర్ ఐడీ లేదా ఆధార్ కార్డ్ తీసుకువెళ్ళడం సరిపోతుంది. జైగావ్ పశ్చిమ బెంగాల్‌లోని అలిపుర్‌దువార్ జిల్లాలోని సరిహద్దు పట్టణంగా ఉంది. ఇది భూటాన్‌లోని ఫుయెంట్‌షోలింగ్ పట్టణానికి ఆనుకుని ఉంటుంది, ఇరు నగరాలను కలిపే ఒకే గేట్ మాత్రమే ఉంది. భారతీయ పౌరులు ముందస్తు వీసా లేకుండా సులభంగా జైగావ్ చేరుకోవచ్చు. ఈ పట్టణంలో చూడదగ్గ ముఖ్య ప్రదేశాలు కూడా ఉన్నాయి. భూటాన్ గేట్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తూ భూటాన్ వాస్తుశిల్ప కళకు అద్భుతమైన ఉదాహరణగా ఉంటుంది. కర్బంది మొనాస్టరీ ఫుయెంట్‌షోలింగ్‌లోని బౌద్ధ దేవాలయం, ఇక్కడి నుండి జైగావ్ పట్టణం మరియు పక్కనే ఉన్న టీ ఎస్టేట్లు అద్భుతంగా కనిపిస్తాయి. అలాగే మొసళ్ల పార్క్ అరుదైన మొసళ్ల జాతులను వీక్షించడానికి ప్రత్యేక ప్రదేశం. జైగావ్ చేరడానికి విమానం లేదా రైలు ఉపయోగించవచ్చు; దగ్గరలోని బగ్డోగ్రా విమానాశ్రయం నుంచి క్యాబ్ లేదా బస్సు ద్వారా చేరవచ్చు, అలాగే హాసిమారా రైల్వే స్టేషన్ నుంచి కేవలం 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. కేవలం జైగావ్ మరియు ఫుయెంట్‌షోలింగ్ ప్రాంతాలను సందర్శించడానికి ఎటువంటి ఫీజు అవసరం లేదు, కానీ భూటాన్ లోపల థింపూ, పారో వంటి ప్రాంతాలకు వెళ్ళాలంటే చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ బడ్జెట్‌లో విదేశీ అనుభూతిని పొందదలచిన పర్యాటకుల కోసం జైగావ్ ఒక పరిపూర్ణమైన డెస్టినేషన్.

# జనసేన పార్టీ శ్రేణులతో మంత్రి నాదెండ్ల మనోహర్ ?

**ఏప్రిల్ 03 (క్రైమ్ కౌంటర్ న్యూస్)** జనసేన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నేతలతో మంత్రి నాదెండ్ల మనోహర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు నేడు రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందనుందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా జనసేన శ్రేణులంతా పండగ వాతావరణంలో సంబరాలు జరపాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రతి ఇంట్లో, జనసేన కార్యాలయాల్లో దీపాలు వెలిగించాలని సూచించారు. దీపాలు వెలిగించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలన్నారు.








**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా.....** ఈరోజు గిద్దలూరు లోని నెమ్మలిగుండం రంగనాయకస్వామి దేవస్థానం నందు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తమల అశోక్ రెడ్డి , ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి వారి కల్యాణమహోత్సవం కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మరియు ఒంగోలు శాసనసభ్యులు శ్రీ దామచర్ల జనార్దన్ రావు ...

## నెమలిగుండ్లలో రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు: రెండో రోజు ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ .



**క్రైమ్ కౌంటర్ న్యూస్..... మార్కాపురం జిల్లా....** రాచర్ల మండలంలోని నెమలిగుండ్లలో జరుగుతున్న ప్రముఖ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పాల్గొని స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయ పరిసరాలను పరిశీలించి, ఉత్సవాల ప్రత్యేకత, ఆలయ చరిత్రపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శనివారం జరగనున్న తెప్పోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. గుండంలో నిర్వహించే ఈ తెప్పోత్సవాన్ని కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్, ఆలయ ఈవో నాగయ్య తదితరులు పాల్గొన్నారు.....

# తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ?



**క్రైం కౌంటర్ ప్రతినిధి,** తిరుమల శ్రీవారిని గురువారం (ఏప్రిల్ 3) రోజున 72,576 మంది భక్తులు దర్శించుకున్నారు. నిన్న 23,887 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.18 కోట్లుగా ఉంది. (ఏప్రిల్ 4) ఉదయం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం... ప్రస్తుతం 31 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనం టోకెన్లు లేకుండా నేరుగా వచ్చే భక్తుల తిరుమల శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం పడుతుంది. ఇక, తిరుమలలో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం కలిగిన భక్తులకు మూడు గంటల్లోపే శ్రీవారి దర్శనం లభించనుంది. ఇదిలాఉంటే, రోజున తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద పదివేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. ఈ టోకెన్లు పొందిన భక్తులకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్యలో దర్శనం కానుంది. ఇదిలాఉంటే, శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు మరో రెండు వేల టోకెన్లు జారీ చేశారు.

క్రైం కౌంటర్
విజయవాడ

# భీమరాజ్ కు గుట్టకు అంటుకున్న మంటలు..

*హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టిబాబు.*





**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 03(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** మున్సిపాలిటీ లోని 24వ వార్డులో తృటిలో తప్పిన ప్రమాదం భీమరాజు గుట్ట పైన భారీగా తగలబడి న చెట్లు,మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో ఒకపక్కమండుటెండ మరొకపక్క వ్యాపిస్తున్న మంటలను అదుపు చేసేందుకు అందుబాటులో ఉన్న సిబ్బందిని వెంటబెట్టుకుని భీమరాజు గుట్ట పైన కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టిబాబు, ఫైర్ సిబ్బందితో కలిసి మంటలు అర్పించి ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా వాటర్ పైపుల ద్వారా మంటలను అదుపు చేయించారు ప్రమాద స్థలానికి కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టిబాబు, ఫైర్ సిబ్బంది తో కలిసి పోలీసులు రెవెన్యూ అధికారులు ప్రమాదం జరిగే సమయంలో హుటాహుటిన వచ్చి మంటలు జననివాసాల మీదకు నిప్పు రకుండా తగు జాగ్రత్తలు చేపట్టారు,ఒక్కసారిగా స్థానికులు అందరూ కూడా ఊపిరి పీల్చుకొని కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టి బాబుకు, వారి సిబ్బందికి ప్రభుత్వాధికారులకు కృతజ్ఞతలు తెలియపరిచారు ఇలాంటి ప్రమాదాలు మరొకసారి జరగకుండా చూసుకోవాలని స్థానిక కౌన్సిలర్లకు స్థానిక ప్రజలకు తెలియపరిచారు ఈ సమయం అక్కడకు చేరుకున్న కౌన్సిలర్ భర్త పులి దాసు, పోలీస్ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అమరావతి చరిత్రలో మీ కృషి.. మరవలేనిది - చరిత్రలో మీ పేరు అజరామజరం షరీఫ్ బాయ్..

**నాటి మీ నిర్ణయమే నేటి అమరావతికి ప్రాణం పోసింది..**
**-ఎన్టీఆర్ జిల్లా,టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ అఫ్సర్**



**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి మున్సిపాలిటీ,ఏప్రిల్ 03(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):**నాడు ప్రతిపక్షాల ఒత్తిడికి వెరవకొండ కౌన్సిల్ చైర్మన్ హోదాలో అహ్మద్ షరీఫ్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం నేడు అమరావతి రాజధాని కి ప్రాణం పోసింది..ఎన్ని కుట్రలు చేసినా అమరావతి పేరును చరప లేక పోయారు... లోక్ సభ లో అమరావతి బిల్లు ఆమోదం పొందడంతో రాష్ట్ర రాజధానిగా అమరావతి చరిత్రలో అహ్మద్ షరీఫ్ పేరు అజరామర్రంగా నిలిచిపోతుందని పార్టీ విధేయత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గా తమ అమూల్యమైన సేవలు అందించిన మొహమ్మద్ అహ్మద్ షరీఫ్ గొప్ప నాయకులు. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన గొప్ప ఉదాహరణ. నమ్మినదాన్ని ఆచరణలో పెట్టటానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో, దృఢ సంకల్పంతో ముందుకు సాగే నిఖార్సైన తెలుగుదేశం పార్టీ నాయకుడు శ్రీ అహ్మద్ షరీఫ్. వై సి పి ప్రభుత్వం అనాలోచితంగా, లోపభూయిష్టమైన మూడు రాజధానుల బిల్లును శాసనసభలో అమోదింప చేసుకుని, మండలిలో ప్రవేశపెట్టి దానిని ఆమోదింప చేసుకోవటానికి చేసిన దుర్మార్గపు ప్రయత్నాలను అడ్డుకుని, బెదిరింపులు లెక్కచేయక కఠోర పరిస్థితులను ప్రశాంత వదనంతో, సామరస్యంతో దృఢ చిత్తంతో బిల్లును సెలెక్ట్ కమిటీ కి పంపటం ద్వారా కొడగట్టి పోతున్న అమరావతి దీపాన్ని తన రెండు చేతులు అడ్డుపెట్టి నిలబెట్టిన ధీశాలి శ్రీ అహ్మద్ షరీఫ్. ఒక పరిణిత రాజకీయ నాయకుడి గానే కాకుండా ముస్లిం సోదరుల ప్రతినిధిగా, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే వ్యక్తి గా, పరిపూర్ణమైన నాయకుడు అహ్మద్ షరీఫ్ భాయ్ ని ఈ శుభ సందర్భంగా గుర్తు చేసుకుంటూ వారిని కలిసి మాజీ తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ హఫీజ్ రహమాన్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ మాబూద్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీలో మరియు అమరావతి ప్రజల గుండెల్లో మీ స్థానం ఎప్పటికీ నిలిచిపోతుందనీ హాట్సాఫ్ షరీఫ్ బాయ్ అంటూ ధన్యవాదాలు తెలిపారు.

# తల్లికి వందనం నిధుల విడుదలకు లైన్ క్లియర్..

*అకౌంట్లోకి రూ. 15 వేలు ఎప్పుడంటే..? డేట్ చెప్పేసిన చంద్రబాబు*



**అమరావతి, ఏప్రిల్ 03 క్రైమ్ కౌంటర్ న్యూస్):** తల్లికి వందనం పథకంపై ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ పథకం కింద స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు కూటమి సర్కార్ ప్రతీ ఏడాది రూ.15 వేల ఆర్దిక సాయం అందిస్తోంది. వీటిని నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లల్లో చదివే 1 నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు వీటిని అందిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఏడాది రూ.15 వేలు జమ చేయగా.. ఈ ఏడాదికి సంబంధించిన నిధులు ఎప్పుడు జమ చేస్తామనే దానిపై ఏపీ సీఎం చంద్రబాబు అధికారికంగా ప్రకటన చేశారు. జూన్‌లో తల్లికి వందనం 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి తల్లికి వందనం నిధులను జూన్‌లో తల్లిదండ్రుల అకౌంట్లలో జమ చేయనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. వేసవి సెలవుల తర్వాత జూన్‌లో స్కూల్స్, కాలేజీలు ప్రారంభమవుతాయి. దీంతో విద్యా సంవత్సరం మొదట్లోనే నిధులు రిలీజ్ చేయనున్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ వర్తింపచేయనున్నారు. ఎలాంటి కొతలు ఉండవని, లబ్దిదారులందరికీ అందుతాయని స్పష్టం చేశారు. ఇక విద్యార్థులకు తల్లిదండ్రులు లేకపోతే సంరక్షకుడి అకౌంట్లో వీటిని జమ చేస్తారు. అయితే తల్లికి వందనం నిధులు జమ కావాలంటే.. విద్యార్థికి 75 శాతం అటెండెన్స్ ఖచ్చితంగా ఉండాలి. విద్యార్థి తల్లికి బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలి. ఆధార్‌తో బ్యాంక్ అకౌంట్ లింక్ అయి ఉండాలి. అయితే విద్యార్థుల నిర్వహణ ఖర్చుల కోసం రూ.2 వేలు కట్ చేసి రూ.13 వేలు అకౌంట్ల జమ అవుతాయి. విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కూకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించింది. గత ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో ఈ స్కీమ్ అమలు చేసింది. ప్రతీ ఇంటికి పైప్ లైన్ గ్యాస్ ఇక రాబోయే రోజుల్లో ప్రతీ ఇంటికి పైప్డ్ నేచురల్ గ్యాస్ అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. దీని వల్ల రానున్న కాలంలో గ్యాస్ కొరత ఉండదన్నారు. ఇక పైప్ లైన్ గ్యాస్ తీసుకున్నవారికి ప్రతీ ఏడాది రూ.2,400 సబ్సిడీగా అందిస్తామని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలోని చేనేతలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందిస్తున్నామని, ఇది సూపర్ హిట్ అయిందన్నారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు పేదల సేవలోనే ఉంటున్నారన్నారు.



## గుంటుపల్లి విచారణ (ఆర్ సి ఎం) ఆధ్వర్యంలో సిలువ మార్గం..

భక్తిశ్రద్ధలతో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు..
ఆలోచింపజేసిన బహిరంగ సిలువ మార్గం..



**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం మండలం,ఏప్రిల్ 03(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** గుంటుపల్లి విచారణ (ఆర్సీఎం) ఆధ్వర్యంలో విచారణ కర్త టి ఆంథోని ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవ సోదరులు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రద్ధలతో ప్రార్థనలు చేసుకుంటూ శిలువ మార్గం నిర్వహిస్తున్నారు. బహిరంగంగా సిలువ మార్గం నిర్వహించారు. క్రైస్తవ విశ్వాసులు సిలువ మార్గాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేసుకుంటూ ముందుకు సాగారు. ప్రార్థన చేస్తూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్రైస్తవ మత బోధకులు ప్రభువు మరణం ఏవిధంగా చెందారనే విషయాన్ని విశ్వాసులకు వివరించారు. ఏసుప్రభు వేషధారణలో ఉన్న వ్యక్తి సిలువను మోస్తూ ముందుకు సాగుతుండగా తనని కొరడాలతో కొడుతూ చేస్తున్న ప్రదర్శన ఎంతో ఆలోచింపజేసింది. గుంటుపల్లి డాన్ బోస్కో స్కూల్ నుంచి ప్రారంభమైన శిలువ మార్గం ఆర్సీఎం చర్చి వరకు సాగింది.

## అమరావతి అంటేనే జగన్‌కు కంపరం!

ఆ పేరు పలకడానికీ ఆయన ఇష్టపడరు
అందుకే మావిగన్ అంటూ వింత ప్రతిపాదనలు
ఎన్డీయే నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్స్



**అమరావతి, ఏప్రిల్ 03 క్రైమ్ కౌంటర్ న్యూస్):** అమరావతి అనేది రాష్ట్ర ప్రజలకు సెంటిమెంట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గురువారం ఎన్డీయే నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో ఎదురైన పరిణామాలను చర్చించారు. వైసీపీ పాలన వల్ల రాష్ట్రానికి 5 ఏళ్ల పాటు రాజధాని లేకుండా పోయిందన్నారు. ఇప్పటికీ రాజధాని విషయంలో వారు చిత్రంగా ప్రవర్తిస్తున్నారని, మావిగన్ అంటూ మాట్లాడుతున్నారని, అమరావతిపై వారికున్న ద్వేషానికి ఇది పరాకాష్ట అని సీఎం వ్యాఖ్యానించారు. అమరావతి పేరు పలకడానికి కూడా జగన్ ఇష్టపడటం లేదన్నారు. అందుకే మావిగన్ అంటూ ఓ వింత పేరును తీసుకొచ్చారని పేర్కొన్నారు. గతంలోనూ 'ఎస్ఆర్ఎం అమరావతి' అని యూనివర్సిటీ పేరు ఉంటే దాన్ని 'ఎస్ఆర్ఎం'గా మార్పించారని తెలిపారు. అమరావతి పేరు వింటే జగన్‌కు కంపరంగా ఉండి, నిత్యం విషం కక్కుతున్నారని అన్నారు. అమరావతిపై జగన్ వైఖరి భవిష్యత్తులోనూ మారదని స్పష్టమైపోయిందన్నారు. రాష్ట్ర ప్రజలందరిలోనూ 'మా రాజధాని అమరావతి' అనే భావన రావాలి, ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన రీతిలో రాజధాని సంబరాలు జరుపుకొనే సమయం ఇదని సీఎం పేర్కొన్నారు. 'గత ఐదేళ్లూ ఎక్కడికి వెళ్లినా.. మీకు మూడు రాజధానులా! అంటూ ఎగతాళిగా మాట్లాడేవారు. ఇప్పుడు సగర్వంగా మా ఏకైక రాజధాని అమరావతి అని చెప్పుకుందాం' అని పిలుపునిచ్చారు. టెలీ కాన్ఫరెన్సులో బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్, జనసేనకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

## రేపటితో ముగియనున్న పాలీసెట్ 2026 దరఖాస్తు గడువు ?

**ఏప్రిల్ 03 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ పాలీసెట్ 2026 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 4వ తేదీతో ముగియనుంది. పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత పొందినవారు అర్హులు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. మే 25న రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష నిర్వహించనున్నారు. ఈ ర్యాంకుల ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో సీట్లు భర్తీ చేస్తారు.


క్రై కౌంటర్ సినిమా

శనివారం 04 ఏప్రిల్ 2026




# ఆ ఒక్క సినిమా నన్ను రాష్ట్రపతి పక్కన కూర్చొబెట్టింది..

నటుడు సుమన్ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో అనేక మలుపులు, సవాళ్లను ఎదుర్కొని నిలబడ్డారు. తన సినీ కెరీర్ ఆరంభంలో యువకుడిగా యాక్షన్, రొమాంటిక్ చిత్రాలతో గ్లామరస్ హీరోగా పేరుపొందారు. ఆ తర్వాత ట్రెండ్‌కు అనుగుణంగా "బావ బావమరిది", "పరువుప్రతిష్ట" వంటి కుటుంబ కథా చిత్రాలకు మారి ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో హీరోగా వరుసగా మూడు సినిమాలు చేశానని, కథా విలువలకు ప్రాధాన్యతనిచ్చే ఈ చిత్రాలు తనకు బాగా కలిసి వచ్చాయని సుమన్ గుర్తుచేసుకున్నారు. తన కెరీర్‌లో అత్యంత ముఖ్యమైన, సవాలుతో కూడిన పాత్రలలో ఒకటి "అన్నమయ్య" చిత్రంలో వెంకటేశ్వరస్వామి పాత్ర అని సుమన్ వివరించారు. ఎన్టీ రామారావు తర్వాత దైవ పాత్రలు అంతగా ఆదరణ పొందకపోవడంతో, ఈ పాత్రను అంగీకరించాలా వద్దా అనే సందేహం తనలో నెలకొందని పేర్కొన్నారు. అయితే, ఈ సినిమా దర్శకుడు కె. రాఘవేంద్రరావు, నిర్మాతలు అశ్విని దత్, దొరస్వామి రాజులు తమ ఇంటికి వచ్చి, వెంకటేశ్వరస్వామి పాత్రకు సుమన్ మాత్రమే సరైనవారని చెప్పడంతో ఆయనలో ధైర్యం వచ్చిందన్నారు. ఈ విషయంలో తన మామ, ప్రముఖ రచయిత డి.వి. నరసరాజు గారి సలహా ఎంతో తోడ్పడిందని తెలిపారు. దర్శకుడి నిబద్ధత, నిర్మాత దొరస్వామి రాజు గారి అభిరుచి ఈ సినిమా విజయానికి తొలి మెట్లు అని సుమన్ అభిప్రాయపడ్డారుఅన్నమయ్య" చిత్రంలో వెంకటేశ్వరస్వామి పాత్ర కోసం సుమన్ ఎనిమిది నెలల పాటు అంకితభావంతో పనిచేశారు. ప్రతిరోజూ ఉదయం ఐదు గంటలకే అన్నపూర్ణ స్టూడియోలో రిపోర్ట్ చేసి, నాలుగు గంటల పాటు మేకప్ వేయించుకునేవారని తెలిపారు. భారీ ఆభరణాలు ధరించి, చెప్పులు లేకుండా, నేలపై పడుకుని, పూర్తిగా శాకాహారిగా ఈ ఎనిమిది నెలల షూటింగ్‌ను పూర్తి చేశానని వివరించారు. మేకప్ పూర్తయిన తర్వాత బ్రేక్ వరకు కిరీటం తీసేవారు కాదని, సాయంత్రం ప్యాకప్ అయ్యే వరకు అదే గెటప్‌లో ఉండేవారని పేర్కొన్నారు. ఈ సినిమా కేవలం సుమన్ అంకితభావంతో మాత్రమే కాకుండా, అనేక మంది కృషి, ప్రతిభతో విజయం సాధించింది. కె. రాఘవేంద్రరావు దర్శకత్వం, దొరస్వామి రాజు గారి అభిరుచి, అశ్విని దత్ నిర్మాణం, విన్సెంట్ గారి అద్భుతమైన కెమెరా వర్క్, సంభాషణలు, మొత్తం నిర్మాణ విలువలు అన్నీ కలిపి "అన్నమయ్య" చిత్రాన్ని ఒక కళాఖండంగా నిలిపాయని సుమన్ ప్రశంసించారు. నాగార్జున కూడా మొదటిసారిగా అలాంటి పాత్ర చేయడం, వారి మధ్య సన్నివేశాలు ప్రేక్షకులకు బాగా నచ్చాయి.ఈ చిత్రం విడుదలైన తర్వాత అప్పటి భారత రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ సినిమాను చూడాలని కోరారు. సుమన్‌ను రాష్ట్రపతి భవన్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించి, ఆయన పక్కన కూర్చుని సినిమా చూసి, కలిసి భోజనం చేయడం తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని తీపి జ్ఞాపకమని సుమన్ గుర్తుచేసుకున్నారు. తనకు 'స్టార్' అనే హోదా కంటే 'నటుడు' అని పిలిపించుకోవడమే ఇష్టమని అన్నారు. ఇప్పటివరకు తెలుగు, తమిళం, కన్నడ సహా సుమారు 11 భాషల్లో నటించారు.



# షుగర్ ఉన్నవారు పుచ్చకాయ తినొచ్చా.. లేదా..?



ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు నీటిశాతం అధికంగా ఉండే పండ్లను తినేందుకు ఇష్టపడతారు.. అలాంటి పండ్లలో పుచ్చకాయ ఒకటి.. పుచ్చకాయలో నీటిశాతం ఎక్కువగా ఉండటంతోపాటు.. సహజ చక్కెర కూడా అధికంగా ఉంటుంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ (+×) 72.. ఇది అధిక వర్గంలోకి వస్తుంది. సాధారణంగా, మధుమేహం ఉన్నవారు తక్కువ (గ్లైసెమిక్ ఇండెక్స్) ఉన్న ఆహారాలను తినాలి. కానీ పుచ్చకాయలో 90 శాతానికి పైగా నీరు ఉంటుంది. దీని కారణంగా, దీని గ్లైసెమిక్ లోడ్ కేవలం 5 మాత్రమే. అంటే, దీనిని తక్కువ పరిమాణంలో తీసుకుంటే, రక్తంలో చక్కెరపై దీని ప్రభావం పెద్దగా ఉండదు..


మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజుకు 100 నుండి 150 గ్రాముల కంటే ఎక్కువ పుచ్చకాయ ముక్కలు తినకపోవడం మంచిది. పుచ్చకాయ రసం తీయడం వల్ల దానిలోని పీచుపదార్థం (ఫైబర్) తగ్గిపోతుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగవచ్చు. అందువల్ల.. మధుమేహ వ్యాధిగ్రస్తులు పుచ్చకాయ రసం కంటే ముక్కలు తినడమే మేలు..

పుచ్చకాయ ముక్కలను బాదం, వాల్‌నట్‌లు లేదా ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన ఇతర ఆహారాలతో కలిపి తినడం వల్ల సహజ చక్కెర శోషణ నెమ్మదిస్తుంది. అయితే, పుచ్చకాయ తినే సమయం కూడా చాలా ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో కూడా పుచ్చకాయను ఉదయం లేదా మధ్యాహ్నం తినడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు రాత్రిపూట ఈ పండు తినడం మంచిది కాదని వారు అంటున్నారు.

పుచ్చకాయ ప్రయోజనాల విషయానికి వస్తే, ఈ పండులో లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. అలాగే, ఇందులో ఉండే విటమిన్-సి రోగనిరోధక శక్తిని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను పూర్తిగా మానుకోవాల్సిన అవసరం లేదు. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి వారు దీనిని మితంగా తీసుకోవాలి.

(గమనిక: పై సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏమైనా సమస్యలుంటే.. వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది..)

# ఇష్టమని ఎడాపెడా తినేస్తే లేనిపోని చిక్కుల్లో పడతారు..



బొప్పాయి పోషకమైన పండు. ఈ పండులో అవసరమైన విటమిన్లు, అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు అందించే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండులో విటమిన్ సితో పాటు ఫైబర్, కెరోటిన్, విటమిన్ ఇ, ఎ, శరీరానికి చాలా ప్రయోజనకరమైన అనేక ఇతర ఖనిజాలు కూడా ఉన్నాయి. బొప్పాయిలోని పదార్థాలు అనేక వ్యాధులను కూడా నివారించగలవు. ఈ పండు ఆరోగ్యానికి ఎంత మేలు చేసేదైనప్పటికీ, కొన్ని రకాల వ్యాధులతో బాధపడేవారి ఆరోగ్యానికి బొప్పాయి అంత మంచిది కాదు. అంటే బొప్పాయి అందరికీ ఒకే విధంగా ప్రయోజనం చేకూర్చదన్నమాట. కాబట్టి బొప్పాయి తినేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి..

బొప్పాయిలో పీచుపదార్థం అధికంగా ఉండి, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇందులో విటమిన్లు ఎ, సి, అలాగే యాంటీఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. అందువల్ల ఇది జీర్ణక్రియకు, రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కాబట్టి ప్రతిరోజూ బొప్పాయి తినడం మంచిది. అయితే ఈ కింది ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రం దీనిని తినకూడదు.

పచ్చకామెర్లు, ఆస్తమా ఆరోగ్య సమస్యలు

పచ్చకామెర్లు, ఆస్తమా వంటి వ్యాధులతో బాధపడేవారు బొప్పాయిని తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. బొప్పాయిలో పాపైన్ వంటి ఎంజైమ్‌లు, బీటా-కెరోటిన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో కామెర్లు, ఆస్తమాతో బాధపడేవారిలో ఇవి పరిస్థితిని మరింత తీవ్రతరం చేయగలవు.

కిడ్నీ వ్యాధులు

మూత్రపిండాల వ్యాధులు ఉన్నవారు, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉన్నవారు బొప్పాయిని పరిమిత పరిమాణంలో మాత్రమే తినాలి. ఎందుకంటే బొప్పాయిలో విటమిన్ సి ఉంటుంది. దీనిని శరీరంలో అధికంగా తీసుకుంటే అది ఆక్సలేట్‌గా మారే అవకాశం ఉంది. ఈ అదనపు ఆక్సలేట్ మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటానికి దారితీస్తుంది. ఇప్పటికే ఉన్న రాళ్ల పరిమాణాన్ని పెంచే అవకాశం కూడా లేకపోలేదు.

గుండె సమస్యలు

అధిక రక్తపోటు, గుండె సమస్యలు ఉన్నవారు బొప్పాయిని పరిమితంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ వ్యాధులు ఉన్నవారు తీసుకునే కొన్ని మందులతో బొప్పాయిలోని ఎంజైమ్‌లు చర్య జరిపి దుష్ప్రభావాలను కలిగిస్తాయి. దీనివల్ల అలర్జీలు, దురద, శరీరంపై దద్దుర్లు వస్తాయి. అందుకే వైద్యుల సలహా మేరకు మాత్రమే బొప్పాయి తినాలి. అంతేకాకుండా ఏవైనా ఇతర దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కూడా తప్పకుండా వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే బొప్పాయి తీసుకోవాలి.

# సంజు క్లిక్ అయితే చెన్నైని ఆపడం కష్టం: క్రిష్

స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్2026లో భాగంగా ఇవాళ పంజాబ్ కింగ్స్‌తో చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో టీ20 వరల్డ్ కప్ 2026 హీరో సంజు శాంసన్ నుంచి భారీ ఇన్నింగ్స్ వస్తుందని మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ అన్నాడు. రాజస్థాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో సంజు విఫలమై నిరాశపరిచాడు. ఇవాళ జరిగే మ్యాచ్‌లో రాణిస్తాడని సీఎస్కే అభిమానులు ఆశిస్తున్నారు. క్రిష్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ..'చెపాక్ స్టేడియం వేదికగా పంజాబ్, చెన్నై మ్యాచ్ జరగనుంది. టీ20 ప్రపంచ కప్‌లో సంజు శాంసన్ పునరాగమనం చేసి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకున్నది ఇదే వేదిక. అందుకే అతను కచ్చితంగా ఈసారి ఒక విధ్వంసకరమైన ఇన్నింగ్స్ ఆడబోతున్నాడు. అతను తిరిగి అద్భుతమైన ఫామ్‌లోకి రావడానికి ఇది సరైన వేదిక. తొలి నాలుగైదు బంతులు చూసిన తర్వాత సంజు చెలరేగిపోవాలి. అతను పీబీకేఎస్‌పై సూపర్ ఇన్నింగ్స్ ఆడతాడని నేను నమ్ముతున్నాను' అని తెలిపాడు. 'సంజు క్లిక్ అయితే మాత్రం చెన్నైను ఆపడం చాలా కష్టం. ఈ మైదానంలో చెన్నై తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు 220 పైచిలుకు స్కోరు నమోదు చేస్తే.. విజయం సాధించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇటు పంజాబ్ కూడా పటిష్ఠమైన జట్టే. శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని పంజాబ్ జట్టు బలంగా




కనిపిస్తున్నా.. బ్యాటింగ్ ట్రాక్‌పై సీఎస్కే కూడా బాగా ఆడగలదు. సంజు దూకుడుగా ఆడితే.. పంజాబ్‌కు ఎలాంటి అవకాశం ఉండదు. సంజుకు దీటుగా నిలబడే బ్యాట్స్‌మెన్ పీబీకేఎస్‌లో ఎవరూ లేరు' అని క్రిష్ విశ్లేషించాడు.

# ఐపీఎల్ 2026: ముంబై ఇండియన్స్‌కు అదిరిపోయే న్యూస్..



స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కోల్‌కతా విధించిన 221 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే ఛేదించి సత్తా చాటింది. తమ తదుపరి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడేందుకు ముంబై సిద్ధమైంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ శనివారం తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు ముంబై జట్టుకు ఓ శుభవార్త అందింది. న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ ఆ జట్టుతో చేరాడు. రేపటి మ్యాచ్‌కు ఈ బౌలింగ్ ఆల్‌రౌండర్ అందుబాటులో ఉండనున్నాడు. మిచెల్ శాంట్నర్ 2019లో ఐపీఎల్‌లో అడుగుపెట్టి.. ఐదు సీజన్ల పాటు చెన్నై సూపర్ కింగ్స్‌తో కొనసాగాడు. 2025 వేలానికి ముందు చెన్నై అతడిని వదిలించుకోగా.. ముంబై ఇండియన్స్ రూ. 2 కోట్ల కనీస ధరకు కొనుగోలు చేసింది. మరోవైపు ముంబై తుది జట్టులో శాంట్నర్కు ప్రస్తుత పరిస్థితుల్లో చోటు దక్కడం కష్టమే అయినా.. ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ మంచి బ్యాకప్ ఆప్షన్‌గా పనిచేస్తాడని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయడంలో ఇతడు ప్రత్యేకం. స్పిన్ కీలకంగా మారే అవకాశం ఉన్న ఢిల్లీ వంటి నెమ్మదైన పిచ్‌పై అతని ఉనికి చాలా కీలకం కావచ్చు. శాంట్నర్ గత సీజన్‌లో 13 మ్యాచ్‌లు ఆడి10 వికెట్లు పడగొట్టాడు. అలానే ఇప్పటి వరకు ఐపీఎల్‌లో 31 మ్యాచ్‌లు ఆడి 25 వికెట్లు కూల్చాడు. ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్‌కు చెందిన దాదాపు అందరు ప్లేయర్లు జట్టుతో చేరారు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ విల్‌జాక్స్ మాత్రం ఎప్పుడు అందుబాటులోకి వస్తాడన్న దానిపై స్పష్టత లేదు.

Published & Owned by katikala Vara Prasad, Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.AP-522006.published at D.no465 Le out no2,Dodleru Road.Ysr Jagananna colony,Krosuru,Guntur AP-522410, Chief Editor Katikala Vara Prasad Reg No's: RNI APTEL/2015/62250, APTEL/25/A2478 & APTEL/25/A2844,APTEL/25/A2843, Ph:9849707349 .
email:kvp6858@gmail.com, website :www.crimecounter.In